క్లుప్తంగా

ఎండు తెగుళ్ల నివారణకు చర్యలు

ఏఓ అరుణకుమారి



వరిపంటను పరిశీలిస్తున్న అరుణకుమారి

ఆమనగల్లు: పంటల్లో ఎండుతెగులు నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఆమనగల్లు మండల వ్యవసాయాధికారి అరుణకుమారి సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లిలో గురువారం వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలను ఆమె పరిశీలించారు. పంటల్లో ఎండుతెగులు నివారణకు చేపట్టాల్సిన చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతులు జంగయ్య, పంతు, జంగయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కడ్తాల్: కడ్తాల్ బీసీ కాలనీకి చెందిన నారమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందింది. బాధిత కుటుంబాన్ని గురువారం రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ పరామర్శించి రూ.5 వేలు ఆర్థికసాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, రైతుబంధు మండల కన్వీనర్ వీరయ్య, వైస్ ఎంపీపీ ఆనంద్, నాయకులు కృష్ణ, దేవానాయక్, శ్రీకాంత్, శ్రీను, మల్లేశ్, మణికంఠ, శివ ఉన్నారు.

సలీం కుటుంబానికి..

కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన సలీం అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా గురువారం పరామర్శించి వారివారి ట్రస్టుల ద్వారా చెరో రూ.5వేలు సాయం అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, ఉప సర్పంచ్ రామకృష్ణ, నాయకులు ఇర్షాద్, కృష్ణ,శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

వృద్ధాశ్రమానికి టీవీ బహూకరణ



ఎల్‌ఈడీ టీవీని అందజేస్తున్న విష్ణుగౌడ్

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని బాటసింగారంలో గల వేంకటేశ్వర సోషల్ సర్వీస్ అసోసియేషన్ ఓల్డ్ ఏజ్ హోంకు బాటసింగారం మాజీ ఎంపీటీసీ, మండల బీజేపీ అధ్యక్షుడు విష్ణుగౌడ్ గురువారం ఎల్‌ఈడీ టీవీని అందజేశారు. తన తండ్రి బండిగారి లక్ష్మీనారాయణ గౌడ్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఆశ్రమ నిర్వాహకుల విజ్ఞప్తి మేరకు టీవీని అందజేసినట్లు విష్ణుగౌడ్ తెలిపారు. భవిష్యత్‌లో వృద్ధాశ్రమానికి ఎలాంటి అవసరం ఉన్నా అండగా ఉంటానన్నారు.

కాంగ్రెస్‌తోనే మైనార్టీల సంక్షేమం

బడంగ్‌పేట్ మేయర్ పారిజాత

పహాడీషరీఫ్: మైనార్టీల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని పీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన గ్యారంటీ పథకాలను చూసి ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్‌లోకి చేరుతున్నారని బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహా రెడ్డి తెలిపారు. జల్‌పల్లి మున్సిపాలిటీ 3వ వార్డు డ్రీమ్ సిటీలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ముస్లింల ప్రగతి కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ జిల్లా నాయకులు రియాజ్ ఖాన్, బీఎంసీ మైనార్టీ చైర్మన్ సయ్యద్ అఫ్జల్ అహ్మద్, ఉపాధ్యక్షుడు మహ్మద్, అబ్దుల్ బారీ, బాబా తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీల్లో రూ. 2.41లక్షలు స్వాధీనం

హస్తినాపురం: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో వనస్థలిపురం పరిధిలోని పలు ప్రాంతాల్లో పోలీసులు వాహన తనిఖీలు చేస్తున్నారు. గురువారం సుష్మాచౌరస్తాలో విజయవాడ రహదారిపై వనస్థలిపురం సీఐ జలేందర్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి వాహనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు వాహనాల్లో తరలిస్తున్న 2 లక్షల 41 వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. మహ్మద్ అబ్దుల్ బషీర్ అనే వ్యక్తి రూ. 1.21 లక్షలు, ఎ. వెంకటేశ్వరరావు అనే వ్యక్తి రూ. 1.20 లక్షలు తరలిస్తున్నారని, వారి వద్ద డబ్బుకు సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నామని సీఐ వెల్లడించారు. విజయవాడ జాతీయ రహదారితో పాటు నాగార్జునసాగర్ జాతీయ రహదారిపై కూడా ఎక్కడపడితే అక్కడ ఆకస్మికంగా వాహనాలను ఆపి ప్రతి రోజు తనిఖీలు చేస్తున్నామని సీఐ జలేందర్‌రెడ్డి చెప్పారు. నిబంధనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు జగన్, మాధవరెడ్డి , నర్సింగ్ రాథోడ్ , పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్‌తో పరేషాన్

- కడ్తాల్ ప్రధాన రహదారికి ఇరువైపులా అక్రమ పార్కింగ్
- ఫుట్‌పాత్‌ను ఆక్రమించిన చిరువ్యాపారులు
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న వాహనదారులు, పాదచారులు
- చోద్యం చూస్తున్న ట్రాఫిక్ పోలీసులు



కడ్తాల్ ప్రధాన రోడ్డుపై నిలిపిన వాహనాలు

కడ్తాల్: మండల కేంద్రంలోని శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిపై ప్రైవేట్ వాహనాలు రోడ్డుపై నిలపడంతో పాదచారులు, ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. దీనికి తోడు వివిధ పార్టీల ఆధ్వర్యంలో తరుచూ ప్రధాన రహదారిపై ధర్నాలు, రాస్తారోకోలు, వివిధ రకాల వేడుకలను నిర్వహిస్తుండటంతో నిత్యం ట్రాఫిక్ జాం అవుతోంది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై డివైడర్ ఏర్పాటు చేసి నాలుగులేన్ల రహదారిగా ఏర్పాటు చేశారు. రోడ్డుకు కిరువైపులా వాహనాలు నిలపడానికి ఫుట్‌పాత్ ఏరియా కూడా ఏర్పాటు చేశారు. అయితే ఫుట్‌పాత్ ఏరియాలో చిరువ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేస్తుండటంతో ప్రైవేట్ వాహనదారులు(ఆటోలు, కార్లు) రోడ్డుపైనే వాహనాలు నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. ఆటోలు, క్రూయిజర్‌లు, ద్విచక్రవాహనాలు రోడ్డుపైనే నిలుపుతుండటంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. అసలే శ్రీశైలం–హైద్రాబాద్ జాతీయ రహదారి కావడంతో వందలాది వాహనాలు ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తాయి. దీంతో నిత్యం ఈ రహదారి రద్దీగా ఉంటుంది. దీనికి తోడు కడ్తాల్ పరిసర గ్రామాలకు ప్రజలను చేరవేసే ఆటోలు, ప్రైవేట్ వాహనాలు రోడ్డుపైనే నిలపడంతో నిత్యం ట్రాఫిక్‌జాం అవుతోంది. దుకాణాల ముందు రోడ్డుపై వాహనాలు నిలిపి ఉంచడంతో వ్యాపారాలు సరిగా సాగడం లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుపై ఆదే విధంగా రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీపై, ప్రైవేట్ వ్యాపారులు షెడ్డులు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేస్తుండటంతో పాదచారులకు ఇబ్బందులు తప్పడంలేదు.

తరచూ ట్రాఫిక్ సమస్య..

రోడ్డుపైనే ఆటోలు, బైక్‌లు నిలిపిఉంచడంతో తరుచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. మండల కేంద్రంలో రోడ్డుకిరువైపులా షాపింగ్ కేంద్రాలు, హోటల్స్ ఉండటంతో వినియోగ దారులు బైక్‌లను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తుండటంతో రాకపోకలు సాగించే వాహనాలు ట్రాఫిక్ ఇక్కట్లకు గురవుతున్నాయి. దీంతో పాటు జాతీయ రహదారిపైనే వివిధ రాజకీయ పార్టీల నాయకులు గంటల తరబడి వివిధ రకాల వేడుకలను నిర్వహిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలంగా మారుతుంది. దీంతో నిత్యం ట్రాఫిక్ జాం అవుతోంది. పోలీసులు రహదారిపై ప్రైవేట్ వాహనాలు నిలపకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

మేనిఫెస్టోను గడపగడపకు తీసుకెళ్లండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

- అభివృద్ధి, సంక్షేమమే బీఆర్‌ఎస్ ఎజెండా
- ప్రార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే మంచిరెడ్డి దిశానిర్దేశం

ఇబ్రహీంపట్నం: గడపగడపకు బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను తీసుకెళ్లి ప్రజలను చైతన్యపరచాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం ఇబ్రహీంపట్నం మండల బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్యనాయకుల సమావేశాన్ని శాస్త్రగార్డెన్‌లో నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తుందన్నారు. ప్రతి ఇంటికి బీఆర్‌ఎస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందాయన్నారు. ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన వారు బీఆర్‌ఎస్‌కు ఓటు వేసే విధంగా పార్టీ శ్రేణులు చైతన్యపరచాలన్నారు. ప్రతి గ్రామంలో మహిళా సంఘాలు, గ్రామ పంచాయతీ నూతన భవనాలు నిర్మించామన్నారు. రాయపోల్, దండుమైలారం అదేవిధంగా కర్ణంగూడ, ఎలిమినేడు మీదుగా బొంగుళూరు వరకు డబుల్ రోడ్డును నిర్మించినట్లు తెలిపారు. కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయాలతోపాటు పలు డివిజన్, ప్రభుత్వ కార్యాలయాలు ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో సుమారు రూ.3వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. ఎన్నికల్లో భారీ మెజార్టీతో తనను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కృపేష్, వైస్ ఎంపీపీ మంచిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మండల అధ్యక్షుడు బుగ్గరాములు, ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బూడిద రాంరెడ్డి, బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు నిట్టు జగదీశ్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పీఏసీఎస్ చైర్మన్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



హాజరైన పార్టీ శ్రేణులు

బీఆర్‌ఎస్‌లో చేరిక..

యాచారం: మండల పరిధిలోని చింతుల్ల గ్రామానికి చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు గురువారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఏలిమినేడులోని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి నివాసంలో ఆయన ఆధ్వర్యంలో గులాబీ కండువా కప్పుకున్నారు. బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని అన్నారు. జెడ్పీటీసీ జంగమ్మ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పాశ్ఛ భాషా, చింతుల్ల సర్పంచ్ సబిత, మాజీ సర్పంచ్ సత్యపాల్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారు

- టీసీపీఐ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరెడ్డి

మంచాల: అమలుకాని హామీలతో మరోసారి ప్రజలను మోసం చేయడానికి గ్రామాలకు వచ్చే పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని టీసీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరెడ్డి అన్నారు. గురువారం మంచాలలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలను మోసం చేయడానికి కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీలు పోటీపడి ముందుకు వస్తున్నాయని మండిపడ్డారు. రైతాంగం అప్పులు చేసి పంటలు సాగు చేస్తే గిట్టుబాటు ధర కల్పించడం లేదన్నారు. పంట రుణాలు పూర్తిస్థాయిలో మాఫీ చేయని ప్రభుత్వాలు పారిశ్రామికవేత్తల రుణాలను మాఫీ చేస్తున్నాయని తెలిపారు. రైతులు దిక్కు తోచని స్థితిలో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వాపోయారు. బంగారు తెలంగాణ చేస్తామని రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారన్నారు. ప్రజలకు నిరంతరం నిజాయితీగా పనిచేసే టీసీపీఐ పార్టీని బలపర్చాలన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీసీపీఐ అభ్యర్థిని గెలిపించి అవకాశవాద పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు శేఖర్, ఈశ్వరయ్య, సయ్యద్ ముస్తాక్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాధవరెడ్డి

యాదయ్యకు నివాళి

ఆమనగల్లు: ఇటీవల మృతిచెందిన టీడీపీ రాష్ట్ర నాయకుడు, శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థాన వ్యవస్థాపకులు బికుమాండ్ల యాదయ్య సంతాప సభను గురువారం ఆమనగల్లు పట్టణంలో నిర్వహించారు. యాదయ్య చిత్రపటానికి నేతలు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కాంగ్రెస్‌రాష్ట్ర నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ గుర్రం కేశవులు, స్థానిక నాయకులు, యాదయ్య కుటుంబ సభ్యులు ప్రమోద్, శ్రీనివాస్‌త, రవి, రమేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సమన్యాయం

- ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీతోనే సమన్యాయం సాధ్యమని కల్వకుర్తి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు మండలం కోనాపూర్‌లో గురువారం గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్ నేత వెంకటేశ్ ఆధ్వర్యంలో కసిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కసిరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారంటీ పథకాలను అమలుచేస్తామని చెప్పారు. ప్రస్తుత ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అసమర్థత కారణంగా కల్వకుర్తి నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిపోయిందని కసిరెడ్డి ఆరోపించారు. తనను ఆశీర్వదించి అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సింగంపల్లిలో ఎన్‌ఎస్‌యూఐ ప్రచారం

కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరుతూ గురువారం ఎన్‌ఎస్‌యూఐ నాయకులు ఆమనగల్లులోని సింగంపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డిని గెలిపించాలని వారు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యుఐ నాయకులు ఫరీద్, రాంబాబు, మహేశ్, యశ్వంత్, అబ్దుల్, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆమనగల్లు: ఎమ్మెల్సీ కసిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

కసిరెడ్డికి పూర్వవిద్యార్థుల మద్దతు

కల్వకుర్తి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డికి ఆమనగల్లు పట్టణంలోని కేఆర్‌డీ ఆర్ జూ.కళాశాల 1990–92 బ్యాచ్ విద్యార్థులు మద్దతు ప్రకటించారు. హైదరాబాద్‌లో కసిరెడ్డి నారాయణరెడ్డి నివాసంలో గురువారం పూర్వ విద్యార్థులు కలిసి ఆయనను సత్కరించారు. పూర్వ విద్యార్థులు లింగంగౌడ్, వేణుగోపాల్‌రెడ్డి, హరికిషన్‌రెడ్డి, విజయ్‌భాస్కర్‌రెడ్డి, మూస, యాదయ్య తదితరులు ఉన్నారు.

అధికారంలోకి రావడం ఖాయం

కడ్తాల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు షాబుద్దీన్ అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కసిరెడ్డి నారాయణరెడ్డికి మద్దతుగా మండల పరిధిలోని వాస్‌దేవ్‌పూర్, చెన్నారంతండా, నేరేళ్లకోళ్లతండాలో ఎన్‌ఎస్‌యూఐ నాయకులు గురువారం ప్రచారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ నరేందర్‌నాయక్, విఠల్, వినోద్, పురుషోత్తం, దర్శన్, ప్రవీన్, క్రాంతి, నవీన్, జశ్వంత్, శివ, విజయ్, చరణ్ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి



ఇబ్రహీంపట్నంలో సమావేశమైన బీఆర్‌ఎస్ నాయకులు

- మంచాల ముఖ్యనాయకుల సమావేశంలో నేతల పిలుపు

మంచాల: బీఆర్‌ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకు పోవాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కుకుడాల అంజిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య అన్నారు. గురువారం మంచాల మండల బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులతో ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. బంగారు తెలంగాణ సాధన కోసం మరోసారి బీఆర్‌ఎస్ పార్టీని, ఇబ్రహీంపట్నంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని గెలిపించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేష్, ఎంపీపీ నర్మద, పీఏసీఎస్ చైర్మన్ పుల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి బహదూర్, జిల్లా నాయకులు సికిందర్‌రెడ్డి, దండేటికార్ రవి, వెంకటేశ్‌గౌడ్, యాదయ్య, భద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మంచిరెడ్డిని గెలిపించుకుందాం..

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి గెలుపుకోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని పోల్కంపల్లి ఎంపీటీసీ మంగ పేర్కొన్నారు. గురువారం పోల్కంపల్లిలో ఎంపీటీసీ మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచిందన్నారు. ఎక్కడాలేని అభివృద్ధి ఇక్కడ జరిగిందన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో పాటు రోడ్లు, భవనాలు, కళాశాలలు నిర్మించి అభివృద్ధికి బాటలు వేశారన్నారు. మంచిరెడ్డి ఇప్పటికే మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది ప్రజలకు సేవలందించారని తెలిపారు. మరోమారు గెలిపిస్తే మంత్రి అయ్యే అవకాశాలు ఉంటయన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి మంచిరెడ్డిని గెలిపించుకుందామన్నారు. బీఆర్‌ఎస్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.

కనులపండువగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

వనస్థలిపురం: వనస్థలిపురం సచివాలయనగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 5వ రోజు గురువారం ఉదయం ఉత్సవ మూర్తులకు అభిషేకం, హయగ్రీవ హోమం, అశ్వవాహనంపై తిరువీధి ఉత్సవం, శ్రీవారి కల్యాణ మహోత్సవం, అన్నప్రసాద వితరణ, సాయంత్రం గరుడ వాహనంపై తిరువీధి ఉత్సవం, డా.ధూళిపాళ మహాదేవమణిచే లలితా ఆవిర్భావం ప్రవచనం కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, వైస్ చైర్మన్ జగదీశ్‌కుమార్,కోశాధికారి శ్రీధర్, శ్యామల, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ కార్యవర్గం ఎన్నిక

వనస్థలిపురం: తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ సీనియర్ సిటిజన్స్ ఆర్గనైజేషన్ కార్యవర్గాన్ని వనస్థలిపురంలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శిగా టి.సుభాకర్‌రావు, కోశాధికారిగా బీఎస్‌వీవీ కృష్ణప్రసాద్, ఉపాధ్యక్షుడిగా ఎ.రాములు, వి.వెంకటనారాయణ, సలహాదారుగా ఎం.సూర్యనారాయణ, సంయుక్త కార్యదర్శులుగా రామారావు, ఎస్.ధనంజయ, కార్యవర్గ సభ్యులుగా ఎం.కృష్ణమూర్తి, బి.జనార్దన్, జి.ప్రసాదరావు, పి.జయప్రకాశ్‌రావు, వి.నరేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. సీనియర్ సిటిజన్స్ సమస్యలపై పోరాడుతామన్నారు. వారి హక్కుల సాధనకై కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామన్నారు.

దేశానికే ఆదర్శం తెలంగాణ



మంత్రి సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

- మంత్రి సబితారెడ్డి

పహాడీషరీఫ్: దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని, కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేయాలని మహేశ్వరం ఎమ్మెల్యే, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ జల్‌పల్లి మున్సిపాలిటీ యూత్ వింగ్ కార్యనిర్వాహక అధ్యక్షుడు యంజాల అర్జున్ ఆధ్వర్యంలో బీజేపీ కార్యకర్తలు మంత్రి సమక్షంలో గురువారం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతీగడపకు అందాయన్నారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన మేనిఫెస్టో పట్ల పేదలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జల్‌పల్లి కో–ఆప్షన్ మెంబర్ సూరెడ్డి కృష్ణారెడ్డి, పార్టీ మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ యంజాల జనార్దన్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, నగేశ్, గోపాల్ రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శరన్నవరాత్రి

కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాల్లో యాగం, ఒడిబియ్యం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పలుచోట్ల అన్నదానం నిర్వహించారు. ప్రముఖులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రి శుభాకాంక్షలు తెలిపారు.

– సాక్షి, నెట్‌వర్క్



యాచారం: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కడ్తాల్: పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఇబ్రహీంపట్నం: లక్ష్మీదేవి అలంకరణలో..



ఆమనగల్లు: అమ్మవారి పూజలో మహిళలు



తలకొండపల్లి: అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మరమ్మతులు చేపట్టరూ..

- కుంగిన తొర్రూర్ రోడ్డు



రోడ్డుపై బోల్తా పడిన ఆటో

హయత్‌నగర్: అధికారుల నిర్లక్ష్యం వాహనదారులకు ప్రాణసంకటంగా మారింది... హయత్‌నగర్ నుంచి తొర్రూరు వైపు వెళ్లే పాత రోడ్డులో 40 రోజుల క్రితం రోడ్డు మధ్యలో కుంగిపోయి పెద్ద గొయ్యి ఏర్పడింది. మరమ్మతు చేసేందుకు అధికారులు నెల రోజులకు పైగా రోడ్డును మూసివేయడం ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్డుకు పూర్తిగా మరమ్మతులు చేపట్టకుండానే వాహనాలను అనుమతించారు. రోడ్డును తవ్విన చోట మట్టి దిబ్బలు, గుంతలను పూడ్చి వేయకపోవడంతో రోడ్డంతా గుంతల మయంగా మారింది. రోడ్డు ఎగుడు దిగుడుగా మారడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు ఓ వైపునకు ఒరిగిపోయి కింద పడుతున్నాయి. ఈ ప్రాంతంలో రోజుకో ప్రమాదం జరగడం పరిపాటిగా మారింది. తాజాగా బుధవారం సాయంత్రం ఇనుప చువ్వల లోడ్‌తో వెళ్తున్న ఓ ఆటో బోల్తా పడింది. దగ్గరలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డుపై మట్టిని పోసి ఎగుడు దిగుడులను సరి చేయాలని వాహనదారులు కోరుతున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.